RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 05 మంగళవారం 23-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## పెళ్లి కూతురు కిడ్నాప్ కలకలం

రాజమండ్రి, ఏప్రిల్ 22 ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే గోదావరి జిల్లాలో పట్టపగలే పెళ్లి కూతుర్ని కిడ్నాప్ కలకలం రేపింది. సినిమా సీన్ తరహాలో కొందరు వ్యక్తులు ఒక్కసారిగా కళ్యాణ మండపం వద్దకు వచ్చి పెళ్లి కూతుర్ని కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రాజమండ్రి రూరల్ కడియంలో పెళ్లి జరుగుతుండగా కొందరు దండగులు ఒక్కసారిగా ఎంట్రీ ఇచ్చి, అక్కడున్న వారి కళ్లల్లో కారం కొట్టి, వధువును కిడ్నాప్ చేసేందుకు యత్నించడం సంచలనంగా మారింది. అప్పటివరకూ ఆ ఫంక్షన్ హాల్ పెళ్లి వేడుకలతో సందడిగా ఉంది. కానీ ఒక్కసారిగా ఊహించని అలజడి చెలరేగింది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పెళ్లి వారికి సంబంధించిన వ్యక్తుల్లా అక్కడి వచ్చారు. ఒక్కసారిగా తమ వెంట తెచ్చుకున్న కారం పొడిని పెళ్లి జరిపిస్తున్న వారి కంట్లో కొట్టారు. మొదట పెళ్లి కూతుర్ని పక్కకు లాగిపడేశారు. ఒవైపు అసలేం జరుగుతుందో బంధువులు తెలుసుకునే లోపే.. ఆ దుండగులు వధువును బలవంతంగా ఈడ్చుకెళ్తున్నారు. ఇది గమనించిన ఓ బంధువు కిడ్నాపర్ల చెర నుంచి విడిపించేందుకు పెళ్లి కూతుర్ని పట్టుకున్నారు. బంధువుల అరుపులు, కేకలతో మిగతా వారు అలర్ట్ అయ్యారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# పులివెందులలో సీఎం జగన్ తరపున సెట్ నామినేషన్ దాఖలు



వైఎస్సార్, పులివెందులలో వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున నామినేషన్ దాఖలు అయ్యింది. మున్సిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి పులివెందుల ఎన్నికల అధికారికి సోమవారం సీఎం జగన్ తరఫున ఒక సెట్‌తో కూడిన నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తరఫున ఇవాళ ఒక సెట్ నామినేషన్ వేశాం. ఈ నెల 25వ తేదీ ఆయనే స్వయంగా వచ్చి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. 25వ తేదీ ఇక్కడ బహిరంగ సభ ఉంటుంది. మధ్యాహ్నం తర్వాతే ఆయన నామినేషన్ వేస్తారు. రాష్ట్రంలో 70 శాతం ప్రజలు సీఎం జగన్ వైపే మళ్లీ చూస్తున్నారు. రెండోసారి ఆయన్ని ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారు అని వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్నారు. ఈ యాత్ర రాష్ట్రవ్యాప్తంగా 2 వేల కిలోమీటర్లు యాత్ర పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు 21 జిల్లాలో సాగింది. బస్సు యాత్ర ముగిసిన వెంటనే.. మరో సెట్‌తో సీఎం జగన్ స్వయంగా పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్ వేస్తారు. ఈ నెల 25వ తేదీన నామినేషన్ల దాఖలు చివరి తేదీ అని తెలిసిందే.

# ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

**ఫలితాల్లో 86.69 శాతం ఉత్తీర్ణత నమోదు**

**బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణతతో బాలికల పైచేయి**

**96.37 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమస్థానం**

**62.47 శాతంతో చివరి స్థానంలో నిలిచిన కర్నూలు**



విజయవాడ,ఏప్రిల్22: పదోతరగతి పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో ఎపి విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలను వెబ్ సైట్‌లో చూడొచ్చు. ఏపీ పదో తరగతి ఫలితాల్లో 86.69 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత వివరాలను విద్యా కమిషనర్ సురేష్ కుమార్ వివరించారు. బాలికలు 89.17 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 84.32 శాతం పాసయ్యారు. 2,803 పాఠశాలలు శతశాతం.. 17 స్కూళ్లలో సున్నా ఉత్తీర్ణత నమోదైంది. 96.37 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో నిలవగా.. 62.47 శాతంతో కర్నూలు చివరి స్థానం దక్కించుకుంది. ఏపీ రెసిడెన్షియల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 98.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 96.72 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ స్కూళ్లలో 92.88 శాతం, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 94.56, ఆశ్రమ పాఠశాలల్లో 90.13 శాతం, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 88.96 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 89.64 శాతం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 79.38 శాతం, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 80.01 శాతం, మున్సిపల్ హైస్కూళ్లలో 75.42 శాతం విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలల్లో 74.40 శాతం విద్యార్థులు పాసయ్యారు. ఫలితాల్లో 69.26 శాతం ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. 11.87 శాతం సెకండ్ క్లాస్, 5.56 శాతం మంది థర్డ్ క్లాస్‌లో పాసయ్యారు. మే 24 నుంచి జూన్ 3 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. రేపటి నుంచి ఆన్‌లైన్‌లోనే రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. 4 రోజుల్లో అధికారిక వెబ్‌సైట్ నుంచి మెమోలు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. పదో తరగతి పరీక్షలను మార్చి 18 నుంచి 30 వరకు నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరీక్షలకు దాదాపు 6.3 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 86.69 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు దాదాపు 7 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 6.16 లక్షలు, గతేడాది ఫెయిలై రీ ఎన్‌రోల్ అయిన విద్యార్థులు లక్షకుపైగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3743 పరీక్షా కేంద్రాల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించారు. ఇకపోతే రెసిడెన్షియల్ 98.43 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూళ్లలో 98. 40 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ మోడల్ స్కూళ్లలో 92.88 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సోషల్ వెల్ఫేర్ 98.45 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆశ్రమ స్కూళ్లు 90.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లు 89.46 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏప్రిల్ 20తో మూల్యాంకనం పూర్తయింది. పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24 నుంచి జూన్ 3 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

## వైసిపి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం..!

**ఎమ్మెల్యే తరఫున ఇంటింటి ప్రచారంలో దూసుకుపోతున్న మహిళలు..!**

**వైసిపి మహిళ నేతలు , జయమ్మ, గిరిజమ్మ, అనుషమ్మ, కుమారి, ప్రియాంకమ్మ, వినమ్మ...!**



శ్రీ ప్రస్థానం ప్రతినిధి భీమన్న రిపోర్టర్ : సంక్షేమం అభివృద్ధి వైకాపా ప్రభుత్వం తోనే సాధ్యమని అవ్వ ప్రతినెల ఒకటో తారీఖునే పెన్షన్ ఇంటి వద్దకే రావాలంటే మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కి కర్నూలు ఎంపీ అభ్యర్థి బి వై రామయ్యకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు, సోమవారం పెద్దకడబూర్ మండల పరిధిలోని నాగలాపురం, విద్యానగర్, గ్రామాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలలో భాగంగా ప్రతి కుటుంబం దగ్గరకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా లబ్ధి చేకూరిందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. బాల నాగిరెడ్డి తరఫున మహిళ నేతలు జయమ్మ, గిరిజమ్మ, అనూషమ్మ, కుమారి, ప్రియాంకమ్మ, వీణమ్మ, మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ హనుమంత్ రెడ్డి, మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్



రెడ్డి ని రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టిడిపి నాయకులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మొద్దని తెలిపారు. పేద ప్రజలకు వైకాపా ప్రభుత్వంతోనే న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, రవి చంద్రారెడ్డి, పూజారి ఈరన్న, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు,ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మూకుమ్మడిగా 30 మంది వాలంటరీ ల రాజీనామా...

దొర్ని పాడు, ఏప్రిల్: 22, శ్రీ ప్రస్థానం న్యూస్:- రానున్న ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డికి బాసటగా నిలిస్తు దొర్ని పాడు మండల కేంద్రంలోని 1,2, గుండుపాపల డబ్ల్యా గోవిందిన్నే గ్రామాలకు సంబందించి 30 మంది గ్రామ వాలంటీర్లు మూకుమ్మడిగా కలిసి సోమవారం నాడు రాజీనామ చేశారు.. దొర్నిపాడు -1 గ్రామ సచివాలయం పరిధిలో 8 మంది, దొర్ని పాడు -2, గ్రామ సచివాలయం పరిధిలో ఇద్దరు, గుండు పాపుల గ్రామ సచివాలయం పరిధిలో 6 మంది , డబ్ల్యా గోవిందిన్నే గ్రామ సచివాలయం పరిధిలో 14 మంది మొత్తం కలిపి 30 మంది గ్రామ వాలంటీర్లు స్వచ్ఛంద గా వచ్చి స్థానిక మండల కార్యాలయంలో తమ రాజీ నామ పత్రాలను ఎంపీడీఓ. పివి. సుబ్బా రెడ్డి కి అందజేసారు..

## ముస్లింల దుస్థితిపై ఎందుకు మాట్లాడరు.. కాంగ్రెస్, ఎస్పీ టార్గెట్‌గా ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్‌లోని అలీఘడ్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోపై మరోసారి తీవ్ర విమర్శలు చేశారు.మహిళల దగ్గర ఉన్న బంగారాన్ని లాక్కుంటామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చిందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్‌కు గెలిస్తే దేశ ప్రజల సంపదను లాక్కుంటారని హెచ్చరించారు. అలీఘడ్ అంటే ఒకప్పుడు సీరియల్ పేలుళ్లకు మారుపేరుగా ఉండేదన్నారు ఇప్పుడు. యోగి పాలనలో ఇప్పుడు యూపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. కాంగ్రెస్, సమాజ్‌వాదీ (ఎస్పీ) పార్టీలపై విరుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ బుజ్జగింపు రాజకీయాలు చేస్తూ పబ్బం గడిపాయని.. ముస్లింల అభివృద్ధి కోసం పాటుపడలేదంటూ మండిపడ్డారు. ముస్లింల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం నేను ఏనాడూ ఏమీ చేయలేదని అణగారిన ముస్లింల దుస్థితిపై చర్చిస్తే వారి వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయంటూ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ వారికి ఇచ్చే ఫలాలన్నింటిని లాక్కుందని.. ముస్లింలు దుర్భర పరిస్థితులలో జీవించవలసి వచ్చిందంటూ పేర్కొన్నారు. ట్రిపుల్ తలాఖ్ రద్దు చేసిన ముస్లిం మహిళలకు న్యాయం చేశామని మోదీ పేర్కొన్నారు.గత పది సంవత్సరాలలో ముస్లింల అభ్యున్నతికి పాటుపడ్డామని మోదీ గుర్తుచేశారు. ట్రిపుల్ తలాక్ బాధితులైన చాలా మంది కూతుళ్ల జీవితాలు నాశనమయ్యాయి.

## ఛత్తీస్‌గడ్ ఎన్కౌంటర్.. ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయిన టాప్ మావోయిస్టులు..




వరుస ఎన్కౌంటర్లు, అరెస్టులతో డీలాపడిన.. మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. విశాఖ రేంజ్ డీఐజీ ఎదుట ఆరుగురు మావోయిస్టులు లొంగిపోయారు. అది కూడా కీలక ఛత్తీస్‌గఢ్ క్యాడర్ కు చెందిన మావోయిస్టులు.లొంగిపోయిన వారిలో ఓ డిసిఎం, ముగ్గురు ఏసిఎంలు, మరో ఇద్దరు పార్టీ మెంబర్లున్నారు. లొంగిపోయిన వారంతా సౌత్ బస్తర్ డివిజన్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీకి చెందినవారు. ఏపీ ? ఛత్తీస్‌గఢ్ ? తెలంగాణ సరిహద్దుల్లో మావోయిస్టు పార్టీ కార్యకలాపాల్లో వీరంతా కీలకంగా వ్యవహరించినవారే కావడం విశేషం.. లొంగిపోయిన వారిలో డివిజనల్ కమిటీ మెంబర్ కుహరం మిథిలేస్ అలియాస్ రాజు, ఏసీఎంలు బరసే మాస, వెట్టి బీమా, వంజం రామే అలియాస్ కమల, పార్టీ మెంబర్లు మడకం సుక్కి, దూడి సోనీ ఉన్నారు. డివిజనల్ కమిటీ మెంబర్ కుహరం మిథిలేస్ అలియాస్ రాజు.. కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతని తలపై ఐదు లక్షల రివార్డు ఉంది. గత 18 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మిథిలేస్.. ఏపీ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో నాలుగు ఎదురుకాల్పుల్లో పాల్గొన్నాడు. 14 మంది జవాన్లను హతమార్చిన కీలకమైన బుర్కా పాల్ ఘటనతో సహా.. మూడు హత్యలతో పాటు 30 కి పైగా ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు.ఇక ఏరియా కమిటీ సభ్యుడు బరిసే మాసపై నాలుగు లక్షల రివార్డు ఉంది. ఏపీ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల రాష్ట్రాల సరిహద్దుల్లో మూడు ఎదుర్కొల్పులు రెండు పోలీసు బలగాలపై దాడులు సహా మూడు హత్యలు.. 20 కి పైగా ఘటనల్లో పాల్గొన్నాడు. మరో ఏరియా కమిటీ మెంబర్ భీమా పై నాలుగు లక్షల రివార్డు ఉంది. ఏపీ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల బోర్డర్ లో నాలుగు ఎదురుకాల్పులతో పాటు రెండు పోలీస్ బాలగాలపై దాడుల సహా 25 కు పైగా ఘటనల్లో పాల్గొన్నాడు.ఏసీఎం వంజం రావే అలియాస్ కమలపై నాలుగు లక్షల రివార్డు ఉంది. ఈమె జనాతన సర్కార్ కమిటీలో పనిచేస్తూ మావోయిస్టు పార్టీ రిక్రూట్మెంట్ లో కీలక పాత్ర పోషించింది. ఇక పార్టీ మెంబర్ మడకం సుక్కి తలపై లక్ష రివార్డు ఉంది.. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో పదికిపైగా ఘటనలో పాల్గొంది. దూడి సోనీ.. మావోయిస్టు పార్టీ రిక్రూట్మెంట్లో ప్రధాన పాత్ర పోషించిందని పోలీసులు తెలిపారు. దళంపై విరక్తితో పాటు.. స్థానికంగా ప్రజల మద్దతు లేకపోవడం ఏపీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సహాయ పునరావాస పాలసీలకు ఆకర్షితులై ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు లొంగిపోయారని అంటున్నారు డిఐజి విశాల్ గున్ని.. ఛత్తీస్‌గఢ్ లో ఎన్కౌంటర్ తో పాటు ఆ ప్రాంత కేడర్ కు చెందిన ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ బలహీన పడుతుందని అన్నారు. భద్రతా బలగాలు పోలీసుల వ్యూహాత్మక విధానాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని.. వాటిని ఇంటర్ స్టేట్ కోఆర్డినేషన్ తో మరింత విస్తృతం చేస్తామన్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులో జనంలోకి రావాలని పిలుపునిచ్చారు.వచ్చే ఎన్నికల కోసం అన్ని విధాల సిద్ధమ వుతున్నామని డిఐజి విశాల్ గున్ని పేర్కొన్నారు.

## జగన్ ఐదేళ్ల వైఫల్యాలే మా ప్రచారాస్త్రాలు

**విజయవాడ తూర్పులో నామినేషన్ వేసిన గద్దె**

విజయవాడ,ఏప్రిల్22 :ఏపీలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. ఈనెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ పక్రియ మొదలవగా.. ఇప్పటికే పలువురు అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు లోకేష్, బాలయ్య , ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఇలా ప్రముఖులు సహా అనేక మంది నామినేషన్లు వేసేశారు. సోమవారం తూర్పు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా గా గద్దె రామ్మోహన్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ కోసం పటమట లంక నుంచి వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు. భారీ ర్యాలీగా వెళ్లి గ్దదె రామ్మోహన్ నామినేషన్ వేయనున్నారు. ఇప్పటికే పటమట లంక నుంచి భారీ ర్యాలీ మొదలైంది. ఈ సందర్భంగా గ్దదె రామ్మోహన్ మాట్లాడుతూ.. తూర్పు నియోజకవర్గంలో మూడో సారి టీడీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలు, ప్రజల ఆదరాభిమానంతో హ్యాట్రిక్ విజయం సాధిస్తామన్నారు. కొంతమంది నాయకులు తమ వల్లే అభివృద్ధి జరిగిందంటూ జబ్బలు చరుచుకుంటున్నారని.. ఎవరేం చేశారో ప్రజలకు తెలుసన్నారు. అబద్దాలు ప్రచారం చేసేవారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గడిచిన ఐదేళ్లల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రచార అస్త్రాలుగా చేసుకుంటామన్నారు. జగన్ చేసిన మోసాలనును అంశాల వారీగా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. జనసేన, బీజేపీ మద్దతుతో 50వేల మెజారిటీ సాధిస్తాననే నమ్మకం ఉందని గద్దె రామ్మోహన్ ధీమా వ్యక్తం చేశారు.

## 10 వ తరగతి ఫలితాల్లో మండల టాపర్ గా సి. ప్రవీణ్ కుమార్..



దొర్ని పాడు, ఏప్రిల్ 22, శ్రీ ప్రస్థానం న్యూస్:-దొర్ని పాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సి.ప్రవీణ్ కుమార్,సోమవారం వెలువడిన 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండల మొదటి ర్యాంక్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు తెలిపారు... ప్రవీణ్ కుమార్ 600 మార్కులకు గాను 544 మార్కులు సాధించి మండల టాపర్గా నిలిచినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు తెలిపారు. అనంతరము హెచ్.ఎం.మాట్లాడుతూ మొత్తం 132 మంది విద్యార్థులకు గాను 115 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాదించి మొత్తం 87.12 ఉత్తీర్ణత సాధించి నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస రావు తెలిపారు..600 మార్కులకు గాను 544 మార్కులు సాధించి ప్రవీణ్ కుమార్ మండల టాపర్ గా నిలువగా 500 మార్కులు పై బడి 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు..పి. వైష్ణవి 538,బి. వెంకట బాను ప్రసాద్ 535, మార్కులు ఎస్.రుక్షన 519 ,టి. పవని 518, ఎం.కులయమ్మ 509, ఎం.ప్రకాష్ 506,టి. వాసు 506,, జి.మాదవి 500,మార్కులు సాధించనట్లు ఆయన తెలియ జేశారు.. 10 పలితాల్లో విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.ప్రభుత్వ పాటశాల ఎంతో అభివృద్ధి చెందింది అనడానికి ఇది ఒక నిదర్శనం అని అన్నారు...



# సంపాదకీయం

మంగళవారం 23-04-2024

## హంగ్ వస్తే... జమిలి లెక్కేంటీ

ఎప్పటి నుంచో వినిపిస్తున్నట్లుగానే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ జమిలి ఎన్నికలకు జైకొట్టింది. ఈ కమిటీ తను నివేదించిన నివేదికలో పలు అంశాలకు సిఫార్సు చేసింది. హంగ్ వచ్చినా, అవిశ్వాస తీర్మానం వంటి పరిస్థితులు నెలకొన్నా,మళ్ళీ ఎన్నికలు నిర్వహించి కొత్త సభను ఏర్పాటుచేయాలని సూచించింది. ఎల్లవేళలా,అధికారంలో ఉండే పార్టీలకు సంపూర్ణమైన మెజారిటీ ఉండకపోవచ్చు.సంకీర్ణంగా ప్రభుత్వాలు నడిపే క్రమంలో, విభేదాల వల్ల ప్రభుత్వం పడిపోయినప్పుడు,ఎన్నికలు మళ్ళీ నిర్వహించాల్సి వస్తుంది. ఇటువంటి సందర్భాల్లో ఏమి చేయాలి? అనే సందేహాలు ఉన్నాయి. ఇలా జమిలి ఎన్నికల అంశంలో అనేక అనుకూల, ప్రతికూల అంశాలు,సందేహాలు, అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపై దేశ వ్యాప్తంగా సమగ్రమైన చర్చ జరగాలి. ప్రజామోదాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలి.చర్చలో అన్ని పార్టీలు పాల్గొనాలి.మంచిచెడు, లాభనష్టాలు బేరీజువేసుకోవాలి. "కేవలం ఇది చర్చించే విషయం కాదని,భారత్ కు ఎంతో అవసరం", అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేకమార్లు ఉద్ఘాటించారు. పార్టీల రాజకీయ స్వార్ధాలు ఎట్లా ఉన్నా,దేశ ప్రజల మంచికి,దేశ ప్రగతికి పట్టంకట్టే విధానాలను స్వాగతించవచ్చు.ఒకప్పటి ఏకకాల ఎన్నికలను పునరుద్ధరించాలన్నది ప్రధాన సిఫార్సు.దేశానికి స్వాతంత్ర్య లభించిన తొలిరోజుల్లో ఈ వ్యవస్థ ఉండేది. ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంతో పాటు దేశ ప్రజల ఆకాంక్షలను సాకారం చేయడానికి జమిలి ఎన్నికలు ఉపయోగపడతాయని బిజెపి ప్రభుత్వం చెబుతున్న మరోమాట. అసెంబ్లీ,లోక్ సభ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం తొలిదశ కాగా,ఈ ఎన్నికలు జరిగిన 100రోజుల లోపే మున్సిపాలిటీలు, పంచాయతీలకు కూడా ఎన్నికలు నిర్వహించడం రెండో దశలో జరగాల్సిన కార్యాచరణగా ఉండాలని ఈ కమిటీ బలంగా చెబుతోంది. కాకపోతే,దీనికోసం ఆర్టికల్ 325ను సవరించాలి. ఈ సవరణకు రాష్ట్రాల సహకారం అవసరం. రేపటి ఎన్నికల ఫలితాల తర్వాత కానీ,ఆయా పార్టీల బలాబలాలు తెలియరావు. సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసే దిశగా కమిటీ పనిచేయడం కూడా ప్రారంభించింది. ప్రజల నుంచి సూచనలు, సలహాలను ఆహ్వానించింది. స్పందన కూడా విశేషంగా వచ్చింది. వేలాదిగా ఈ -మెయిల్స్ వచ్చాయి. కేంద్రం మొన్నామధ్యనే 6 జాతీయ పార్టీలు, 33 ప్రాంతీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. ఇప్పటివరకూ 35 పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలుస్తోంది.జమిలి ఎన్నికలకు సంబంధించి న్యాయ కమిషన్ నుంచి కూడా సలహాలు తీసుకుంది. మరి కొన్ని నెలల వ్యవధిలోనే సాధారణ ఎన్నికలు జరగాల్సిన నేపథ్యంలో,ప్రతిపక్ష పార్టీల వ్యాఖ్యల వేడి పెరుగుతోంది.అనేకసార్లు లోక్ సభ రద్దయిందని, భవిష్యత్తులో కూడా అటువంటి పరిస్థితులు తలెత్తుతాయనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఓటర్ల ఎన్నికల విశ్వాసాన్ని ఉల్లంఘించడం న్యాయమా? అని ఆవె ప్రశ్నిస్తున్నారు.తృణమూల్ పాటు మిగిలిన ప్రతిపక్ష పార్టీలకు అనేక భయాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు ఎన్నో అనుమానాలు ఉన్నాయి.'జమిలి' అంటే రాష్ట్రాలపై దాడి చేయడమేనని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శనా బాణాలు సంధిస్తునే వున్నారు.ఈ ఎన్నికల వల్ల సామాన్యులకు ఒరిగేదేంటని కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారు. 2029 నుంచి లోక్ సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేలా లా కమిషన్ ఓ ఫార్ములా రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లా కమిషన్ ఇంకా తుది నివేదికను తయారుచేయాల్సివుంది. పంచాయతీల నుంచి పార్లమెంట్ దాకా ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలన్నది బిజెపి ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ముఖ్యంగా,దీనివల్ల డబ్బు ఆదా అవుతుందని,ఆ ధనాన్ని అభివృద్ధి పనుల కోసం కేటాయించవచ్చని మోదీ సర్కార్ వాదిస్తోంది.ఈ చర్చ ఈనాటిది కాదు.2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన వెనువెంటనే అన్ని పార్టీలను ఆహ్వానించి దీనిపై చర్చ కూడా జరిపారు.అప్పట్లో దేశ వ్యాప్తంగా మొత్తం నలభై రాజకీయ పార్టీలను ఈ సమాలోచనకు ఆహ్వానించారు. 21పార్టీలు మాత్రమే హాజరయ్యాయి.తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రాంతీయ పార్టీలు అప్పట్లో జమిలి ఎన్నికలకు జై కొట్టాయి. వచ్చిన మిగిలిన పార్టీలు విభిన్న స్వరాలను వినిపించాయి. కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగానే ఉంది. లోక్ సభకు,శాసనసభలకు సమాంతరంగా ఏకకాలంలో జరపడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి, ప్రధానంగా ఖర్చు కలిసివస్తుందన్నది వాస్తవమే. వివిధ ఎన్నికల కోడ్ పేరుతో జరగాల్సిన కార్యక్రమాలు జరగకుండా పనులు ఆగిపోవడం, సమయం వృధా అవ్వడం మొదలైన వాటికి అడ్డుగోడ పడుతుంది.తద్వారా పనిరోజులు పెరుగుతాయి.ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. కనీసం రెండు,మూడు రాష్ట్రాలలో ఎన్నికలు తప్పనిసరిగా వస్తుంటాయి.ఈ నేపథ్యంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోడానికి వెనుకాడే పరిస్థితి వస్తుంది.అదే అన్ని చోట్ల సమాంతర ఎన్నికల విధానం అందుబాటులో ఉంటే,కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి మరింతగా పరిపాలనపై దృష్టి సారించే వెసులుబాటు ఉంటుంది. ఐదేళ్లకొకసారి అన్ని వ్యవస్థలకు ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల రాజకీయ సుస్థిరత నెలకొనే అవకాశం ఉంది.బిజెపి ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలపై కొందరు అనేక అనుమానాలు, సందేహాలు,అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఈ ప్రతిపాదన వల్ల ఎటుచూసినా,కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికే ఎక్కువ మేలుజరుగుతుందనీ,అందుకే, దీనిపై బలంగా ప్రచారం చేస్తోందనే భావంలో ప్రతిపక్షాలు ఉన్నాయి.కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజంగా ఆధిక్యత వస్తుందనీ,దాని వల్ల ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందనే భయంలో కొన్ని ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి.దీని వల్ల వారు అనుసరించే విధానాల వల్ల దేశ సమగ్రతకు జమిలి ఎన్నికల వల్ల భంగం కలిగే ప్రమాదం ఉందనీ కొందరు విమర్శిస్తున్నారు.పరోక్షంగా అధ్యక్ష వ్యవస్థకు నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు దీని వెనకాల దాగి ఉన్నాయనే భయాలు కొందరిలో లేకపోలేదు.ఈ భయాలన్నీ ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్ కు, ఆ పార్టీని అనుసరిస్తున్న కొన్ని పార్టీలకు ఉన్నాయి. జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే, కొన్ని శాసనసభల పదవీకాలాన్ని కుదించాలి,కొన్నింటిని పొడిగించాలి.ఇటువంటి కీలకమైన చర్యలకు రాజ్యాంగ సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉంది.దీనికి సరిపడా బలం ఉభయ సభల్లోనూ బిజెపికి ఉంది. 'సమాంతర ఎన్నికల'పై, 2018 ఆగస్టులో లా కమిషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది.

# రాయలసీమపై కాంగ్రెస్ దృష్టి

తిరుపతి, ఏప్రిల్ 22 ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీని షర్మిల వ్యూహాత్మకంగా ఎన్నికల పోరాటంలో బరిలో నిలుపుతున్నట్లుగా కనిపిస్తోంది. ఏపీ కాంగ్రెస్ వ్యవహారాలపై తెర వెనుక కొంత మంది సీనియర్లు పని చేస్తున్నారు. కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి లాంటి వాళ్లు బయట పెద్దగా కనిపించడం లేదు. కానీ తెర వెనుక మాత్రం చురుగ్గా వ్యవహరిస్తున్నారు. వైసీపీలో అసంతృప్తికి గురైన నేతల్ని తీసుకుని పోటీకి ఒప్పిస్తున్నారు. రాయలసీమతో పాటు కోస్తాలో బలమైన నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రచారం చేస్తున్నారు. అయితే వీరి వ్యూహాలన్నీ గెలవడానికి కాదు.. ఓడించగలిగే శక్తి ఉందని నిరూపించడానికి అన్నట్లుగా రాజకీయం నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ బలాన్ని రాయలసీమలో బలంగా చూపించేలా షర్మిల ప్రయత్నం చేస్తున్నారు. విస్తృత పర్యటనలు చేస్తున్నారు. కడప పార్లమెంట్ నియోజవకర్గం మొత్తం ఓ సారి సంచలనం రేపారు. కొంగు చాపి న్యాయం చేయాలని ప్రజల్ని కోరారు. ఆమె ప్రకటనతో ఒక్క సారిగా వైసీపీలో ప్రకంపనలు వచ్చాయి. అలాగే వైఎస్ వివేకా హత్య కేసును చర్చనీయాంశం చేశారు. అయితే కోర్టుకెళ్లి ఎవరూ మాట్లాడకుండా ఆర్డర్స్ తెచ్చుకున్నారు వైసీపీ నేతలు. కానీ ప్రజల్లో చర్చ మాత్రం ఆగే అవకాశం కనిపించడం లేదు. కడప నుంచి ప్రారంభించి షర్మిల కర్నూలులోనూ ప్రచారం చేశారు. షర్మిల సభలకు జనం ఉరకలెత్తకపోయినా కాంగ్రెస్ పార్టీకి కూడా ఆదరణ ఉంది అనిపించేలా వస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి కనీసం సభలు పెట్టేంత వెసులుబాటు ఉండేది కాదు. కానీ ఇప్పుడు షర్మిలసభ అంటే.. జన సమీకరణ చూపించగలుగుతున్నారు. కడప, కర్నూలు జిల్లాల్లో షర్మిల చేసిన ప్రచారానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు సంతృప్తిగా ఉన్నాయి. సునీత కూడా షర్మిలతో ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల దాఖలు తర్వాత కూడా రాయలసీమలోనే షర్మిల ఎక్కువగా ప్రచారం చేసే అవకాశం ఉంది. కొన్ని కీలక నియోజకవర్గాలపై గురి పెట్టి.. ప్రచారం చేయనున్నారు. కాంగ్రెస్ కు వచ్చే ప్రతి ఓటు వైసీపీదేనన్న అభిప్రాయం ఉంది. ముస్లిం, దళిత ఓటర్లు ఈ సారి కాంగ్రెస్ వైపు మొగ్గే అవకాశాలు ఉన్నాయి. వైఎస్ వివేకా హత్య



కేసు వ్యవహారంతో మహిళా ఓటర్లూ వైసీపీకి దూరమవుతారని.. తమకు దగ్గరవుతారని కాంగ్రెస్ అనుకుంటోంది. షర్మిల రాయలసీమలో సీట్లు గెలవలేకపోవచ్చు కానీ.. వైసీపీ ఓటమిని శాసిస్తే మాత్రం.. తర్వాత ఆమెదే రాజకీయ భవిష్యత్ అయ్యే అవకాశం ఉంది. షర్మిలనే ప్రజలు వారసురాలిగా గుర్తిస్తున్నరన్న అభిప్రాయం పెరుగుతుంది. వైసీపీ ఉనికి ప్రమాదంలో పడుతుంది.. మళ్లీ కాంగ్రెస్సే ముందుకు వస్తుంది. ఈ వ్యూహంతోనే షర్మిల అడుగులు వేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఓ ప్రత్యేక వ్యూహంతోనే రాజకీయం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. షర్మిల ప్రత్యేకంగా ఓ బ్యాకప్ టీముని ఏర్పాటు చేసుకుని కీలకమైన నియోజకవర్గాల్లో అవకాశం ఉన్న చోట ప్రభావం చూపే నాయకుల్ని ఆకర్షించి మరీ టిక్కెట్లు ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. ఇప్పటికి నలుగురు ఎమ్మెల్యేలు, ఓ కేంద్ర మాజీ మంత్రి వైసీపీలో చేరి అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యేలంతా దళితులే. అంతే కాదు నియోజకవర్గాల్లో అభ్యర్థులుగా ఖరారు చేసిన వారిలో చాలా మంది తమ తమ సామాజికవర్గాల్లో అంతో ఇంతో పట్టున్నవారే. పైగా ఆర్థికంగానూ బలంగా ఉండే వారిని ఎంపిక చేసుకున్నారు.

నందికొట్కూరు నుంచి ఆర్థర్, చింతలపూడి నుంచి ఎలీజా, పూతలపట్టు నుంచి ఎంఎస్ బాబు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కాంగ్రెస్ లో చేరారు. వీరంతా వైసీపీకి వీర విధేయులు. టిక్కెట్ ఇవ్వకపోయినా చాలా రోజులు పార్టీని వీడలేదు. అయినా ఆ పార్టీని వదిలేసి వచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. టిక్కెట్ ఇవ్వకపోయినా చాలా రోజులుగా సైలెంట్ గా ఉన్న తర్వాత షర్మిల టీం చర్చలు జరిపి వీరిని పోటీకి అంగీకరింప చేసింది. ఇక కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి .. జగన్ పై తీవ్ర ఆరోపణలు చేసి కాంగ్రెస్ లో చేరి.. టెక్కలి నుంచి పోటీ చేయడానికి సిద్ధమయ్యారు.ఇలా కనీసం 30 నుంచి 40 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలమైన అభ్యర్థుల్ని నిలబెడుతోంది. అయితే వీరి బలం గెలవడానికి సరిపోదు. కానీ ఓడించడానికి ఉపయోగపడుతుంది. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ఏ స్థానంలోనూ నోటాను మించి ఓట్లు రాలేదు. కానీ ఈ సారి షర్మిల ప్రభావం గట్టిగా కనిపించనుంది. కీలకమైన స్థానాల్లో పది నుంచి పదిహేను వేల ఓట్లు చీలిస్తే పోటీలో ఉన్న కొంత మంది అభ్యర్థుల జాతకాలు తారుమారు అవుతాయి. అంత బలం చూపించేవారినే అభ్యర్థులుగా ఖరారు చేశారు. కర్ణాటక,తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. అక్కడ్నుంచి ఏపీ కాంగ్రెస్ పార్టీకి సాయం అందుతోంది. రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నారు. విశాఖ బహిరంగసభలోనూ ప్రసంగించారు. . కాంగ్రెస్ పార్టీ చీల్చే ప్రతి ఓటు వైసీపీకి లాసే. పీసీసీ చీఫ్ గా షర్మిల బాధ్యతుల తీసుకుంటే తాను పూర్తి స్థాయిలో సహకరిస్తానని గతంలో రేవంత్ ప్రకటించారు. ఆ ప్రకారం ఆపరేషన్ నిర్వహిస్తున్నారని అంటున్నారు. కాంగ్రెస్ కు పని చేస్తే.. టీడీపీకి ఎలా మేలు చేసినట్లన్న డౌట్ రావొచ్చు. అదే రాజకీయం. కాంగ్రెస్ ఎన్ని ఓట్లు చీలిస్తే.. వైసీపీకి అంత డ్యామేజ్. కర్ణాటక నుంచి కూడా సహకారం అందుతోందని చెబుతున్నారు. అన్నీ కలసి వస్తే షర్మిల కాంగ్రెస్ పార్టీ ఉనికిని ఏపీలో బలంగా చాటే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## గుంతకల్లు లో వ్యూహాలు, ప్రతి వ్యూహాలు

అనంతపురం, ఏప్రిల్ 22 ఆ నియోజకవర్గంలో ఆ నేతకు టికెట్ ఇస్తే సహకరించే పరిస్థితి లేదన్నారు. పక్క జిల్లా నుంచి వచ్చి పార్టీలో చేరితే టికెట్ ఎలా ఇస్తారు అంటూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పైనే ప్రత్యక్షంగా విమర్శలు కూడా గుప్పించారు. అవన్నీ లెక్కచేయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ నేత పార్టీలోకి చేరగాని గుంతకల్లు అసెంబ్లీ టికెట్లు కేటాయించారు. ఇంతకు ఆ నేత ఎవరు ఆ నేతపైన చంద్రబాబు నాయుడుకి అంత నమ్మకం ఏంటి ఈ స్టోరీలో తెలుసుకుందాం. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలు పార్టీలో చాలామందికి మింగుడు పడటం లేదు. పార్టీ నేతలు సీనియర్లు ఎంత చెప్పినా వినకుండా గెలుపే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆ పార్టీ నేతలు చెవులు కోరుకుంటున్నారు. అందులో భాగంగానే గుంతకల్లు నియోజకవర్గం అసెంబ్లీపై చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిని సారించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆలూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన గుమ్మనూరు జయరాం.. ముఖ్యమంత్రి జగన్ క్యాబినెట్లో కార్మిక శాఖ మంత్రిగా కొనసాగుతున్న సమయంలోనే వైసీపీ పార్టీలో ఇమడలేక కొన్ని అనివార్య కారణాలతో ఆ పార్టీని విడాల్సి వచ్చింది. దీంతో గుమ్మనూరు జయరాం ఏ పార్టీలోకి వెళ్తారు అని పెద్ద చర్చని కొనసాగింది. అనుకోకుండా గుమ్మనూరు జయరాం టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం కండువా కప్పుకున్నారు. పార్టీలోకి అధినేత చంద్రబాబు నాయుడు మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కు ఏకంగా గుంతకల్లు అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. వాల్మీకి (బీసీ) సామాజిక వర్గంలో అనతి కాలంలోనే గుర్తింపు తెచ్చుకున్న నేతగా గుమ్మనూరు జయరాంకు పేరుంది. ఆలూరు నియోజకవర్గం నుంచి 2009 ఎన్నికల్లో పిఆర్పి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున 2014, 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. జగన్ క్యాబినెట్లో మంత్రిగా కూడా పనిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి సామాజిక వర్గంలో గుర్తింపు తెచ్చుకున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గుంతకల్లు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. అవేమీ లెక్క చేయని గుమ్మనూరు జయరాం ఎన్నికలు నాటికి అందర్నీ ఏకతాటిపై తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో నియోజకవర్గంలోని వ్యతిరేకులను,అసంతృప్తులను ఏకం చేసేందుకు జయరాం సోదరుడు నారాయణస్వామి, కుమారుడు ఈశ్వర్ రంగంలోకి దిగారు. మండలాల వారీగా నాయకులతో కలుస్తూ వ్యతిరేకులను అసంతృప్తులను కలిసి పార్టీకి పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో తెలియజేస్తూ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను ఏకతాటిపైకి తెచ్చి గుంతకల్లు నియోజకవర్గంలో గెలుపు దిశగా అడుగులు వేస్తున్నారు. ఎన్నికల్లో టికెట్ రాకపోవడంతో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ తీవ్ర అసంతృప్తితో ఉండడంతో గుంతకల్లు నియోజకవర్గంలోని అసంతృప్తులను ఏకం చేసేందుకు అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి రంగంలోకి దింపి జితేంద్ర గౌడ్ ను పార్టీ కోసం పనిచేయాలని ఆదేశించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అధినేత చంద్రబాబు నాయుడు జితేంద్ర గౌడ్ కి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానంటూ హామీ ఇచ్చారు. స్వయంగా అధినేత హామీ ఇవ్వడంతో శాంతిచ్చిన మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ గుమ్మనూరు జయరాంకు సహకరించలని నియోజకవర్గ తెలుగుదేశం క్యాడర్ కు పిలుపునిచ్చారు. పార్టీలో ఎన్ని సమస్యలు ఉన్నా కూడా మన అధినేత చంద్రబాబునాయుని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచే విధంగా పలు సందర్భాల్లో మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ప్రసంగించారు. గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా వాల్మీకి (బీసీ) ఓటర్లు అధికంగా ఉండడంతో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గుమ్మనూరు జయరాంకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు టికెట్ ఇచ్చినట్లు జోరుగా చర్చ సాగుతుంది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా గుంతకల్లు,రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గం లో కూడా బీసీ ఓటర్లు అధికంగా ఉండడంతో ఆ సామాజిక వర్గానికి అధినేత చంద్రబాబు నాయుడు ప్రాధాన్యత ఇచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు వైఎస్ఆర్సిపి పార్టీ నుంచి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి వైసీపీ తరఫున బరిలో నిలుస్తున్నారు.

## మర్రిచెట్టు తొర్రలో 66 లక్షలు

ఒంగోలు, ఏప్రిల్ 22 మర్రిచెట్టు తొర్రలో రూ.66 లక్షల నగదును చూసిన పోలీసులు అవాక్కయ్యారు. ఓ ఏటీఎం వ్యానులో నగదు చోరీ చేసిన దొంగలు ఎక్కడ దాచాలో తెలియక చెట్టు తొర్రలో సొమ్ము దాచారు. నిందితులను గుర్తించిన పోలీసులు నగదు రికవరీ చేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న ఒంగోలులోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గర చోరీ జరిగింది. ఒంగోలు - కర్నూల్ రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు ఆవరణలో ఏటీఎంల్లో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీకి చెందిన వ్యాన్ వచ్చి ఆగింది. ఈ వాహనంలో రూ.68 లక్షల నగదు ఉండగా.. సిబ్బంది మధ్యాహ్నం సమయం కావడంతో భోజనం చేసేందుకు వెళ్లారు. వారు తిరిగి వచ్చి చూసే సరికి వ్యానులో నగదు మాయమైంది. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనపై సీఎంఎస్ ఏజెన్సీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. వాహనం నుంచి సుమారు రూ.66 లక్షల నగదు దోపిడీకి గురైనట్లు సంస్థ లోకల్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యాన్ డోర్ మధ్యలో ఉన్న హోల్ లో నుంచి చెయ్యి పెట్టి లాక్ ఓపెన్ చేసిన దుండగులు.. అక్కడే బ్యాగులో ఉన్న రూ.66 లక్షలు దోచుకుని వెళ్లారు. ఈ నెల 18న ఒంగోలు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గర చోరీ జరిగింది. ఒంగోలు-కర్నూలు రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు ఆవరణలో ఏటీఎంలలో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీకి చెందిన వ్యాను వచ్చింది. ఈ వ్యానులో రూ.68 లక్షల నగదు ఉంది. మధ్యాహ్నం సమయం కావడంతో నగదు ఉన్న వ్యాను పెట్రోల్ బంక్ ఆవరణలో నిలిపి ఏటియం సెంటర్ వెనుక వైపు భోజనం చేసేందుకు వెళ్లారు. సిబ్బంది తిరిగి వచ్చే సరికే వ్యానులో నగదు మాయం అయింది. సినీ ఫక్కీ జరిగిన ఈ చోరీ ఘటనపై సీఎంఎస్ ఏజెన్సీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఈ వాహనం నుంచి సుమారు రూ. 66 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్టు సీఎంఎస్ సంస్థ లోకల్ మేనేజర్ కొండారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యాన్ డోర్ మధ్యలో ఉన్న హోల్‌లో నుంచి చెయ్యి పెట్టి లాక్ ఓపెన్ చేసి లోపలికి వెళ్లిన దుండగులు... అక్కడే ఉన్న బ్యాగులో రూ.66 లక్షలు సర్దుకుని పరారయ్యాడు. రెండు లక్షలను అక్కడే వదిలేశాడు. లంచ్ చేసి వచ్చిన సిబ్బంది వ్యాను డోర్ తీసి ఉండడంతో వెంటనే నగదు కోసం చూశారు. క్యాష్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసుల దర్యాప్తులో సీఎంఎస్ ఉద్యోగులే నిందితులని తేలిపింది. దొంగిలించిన డబ్బు మొత్తాన్ని నిందితులు ఓ మర్రి చెట్టు తొర్రలో దాచి పెట్టడం ఇక్కడ విశేషం. ఒంగోలు సీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ కొండారెడ్డి, సీఎంఎస్ మాజీ ఉద్యోగి మహేష్‌బాబ, రాచర్ల రాజశేఖర్ చోరీ చేసినట్లు గుర్తించారు. టెక్నికల్ ఆధారాలతో ముందు మహేష్ బాబును పట్టుకున్నామన్నారు. అతడిని విచారించగా... అసలు విషయం తెలిసిందన్నారు. చోరీ చేసిన నగదును మర్రి చెట్టు తొర్రలో దాచారని, డబ్బు రికవరీ ప్రకాశం ఎస్పీ గరుడ్ సుమిత్ అనీల్ తెలిపారు. లింగారెడ్డి కాలనీలోని సీఎంఎస్ కార్యాలయం వద్ద రాజశేఖర్, కొండారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. పనిచేస్తున్న కంపెనీకే కన్నం వేయాలని ప్రయత్నించి నిందితులు దొరికిపోయారు.

## త్రిముఖ పోటీలో అసమ్మతి కుంపట్లు...

నెల్లూరు, ఏప్రిల్ 22 ఎన్నికల వేళ కూటమిలో అసమ్మతి కుంపట్లు కాక రేపుతూనే ఉన్నాయి. నామినేషన్ల పర్వం కొనసాగుతున్నా టిక్కెట్ల వేడి ఇంకా చల్లారడం లేదు. టిక్కెట్లు దక్కకపోవడంతో పలువురు నేతలు తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. ప్రత్యర్థుల సంగతి ఏమోగానీ.. స్వపక్షంలోనే విపక్షం తయారు కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కూటమి అభ్యర్థులు. తాజాగా.. నెల్లూరు జిల్లా టీడీపీలో రెబల్స్ బెడద క్యాండేట్లకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఇంతకీ.. నెల్లూరు జిల్లాలో రెబల్స్ బెడద ఎవరెవర్ని వెంటాడుతోంది.? రెబల్స్‌తో కూటమి నేతలు ఎలాంటి చర్చలు చేస్తున్నారు.?ఏపీ రాజకీయాలు హాట్‌హాట్‌గా కొనసాగుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ఎవరికివారు జోరుగా ప్రచారం చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్తున్నారు. అయితే.. నామినేషన్ల గడువు ముగింపు దశకు చేరుకుంటున్నా.. కూటమిలో మాత్రం కుంపట్లు చల్లారడం లేదు. దానికి తగ్గట్లే.. నెల్లూరు జిల్లా టీడీపీలో నేతల అసమ్మతి రోజురోజుకీ ముదురుతోంది. ప్రధానంగా.. కందుకూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. కందుకూరు టిక్కెట్ టీడీపీ అధిష్టానం ఇంటూరి నాగేశ్వరరావుకి ఇవ్వగా.. అవకాశం దక్కకపోవడంతో ఇంటూరి రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు టిక్కెట్ దక్కలేదనే కోపంతో రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. దానిలో భాగంగా ఆత్మీయ సమావేశం నిర్వహించిన ఇంటూరి రాజేష్.. కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. అంతేకాదు.. కందుకూరులో టీడీపీని ఓడించి తీరుతానని రాజేష్ శపథం చేయడం ఆసక్తిగా మారుతోంది. టీడీపీ అధిష్టానంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన కందుకూరు రెబల్ అభ్యర్థి రాజేష్‌కి స్థానికంగానూ మద్దతు పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత దివి శివరాం రాజేష్‌కు మద్దతు ప్రకటించడం ఆసక్తిగా మారింది. టీడీపీ అధిష్టానం టిక్కెట్ ఇచ్చిన ఇంటూరు నాగేశ్వరరావుకు మద్దతు ఇవ్వబోనని తేల్చి చెప్పారు శివరాం. రాజేష్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. తమ కుటుంబాన్ని దూషించిన నాగేశ్వర్ రావుకు ఎట్టిపరిస్థితుల్లో మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు దివి శివరాం.మరోవైపు.. నెల్లూరు జిల్లా కావలిలోనూ రెబల్ రచ్చ ముదురుతోంది. కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డి బరిలో దిగుతుండగా.. బీజేపీ నేత పసుపులేటి సుధాకర్ రెబల్‌గా పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీని వీడి టీడీపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన.. చంద్రబాబు మోసం చేశారంటూ మండిపడ్డారు. ఈ క్రమంలోనే.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు నిర్ణయం తీసుకున్నారు పసుపులేటి సుధాకర్. రేపు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అటు.. జోరుగా ప్రచారం చేస్తున్న పసుపులేటి సుధాకర్‌ని టీడీపీ నేతలు బుజ్జగించినా ఫలితం దక్కలేదు. ఇదిచాలదన్నట్లు.. ఎన్నికల్లో పోటీ చేసి సత్తా ఏంటో చూపిస్తానన్నారు పసుపులేటి సుధాకర్. దాంతో.. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా.. నెల్లూరు జిల్లా కందుకూరు, కావలి నియోజకవర్గాల్లో రెబల్స్ బెడదతో కూటమి క్యాండేట్లు తలలు పట్టుకుంటున్నారు. అయితే.. కూటమి అగ్రనేతలు రంగంలోకి దిగి రెబల్స్‌ను బుజ్జగిస్తున్న నేపథ్యంలో.. నామినేషన్ల పర్వం ముగిసేనాటికి విత్‌డ్రా చేసుకుంటారా?లేదా అన్నది చూడాలి.

TDP BJP JANA SENA

## ఏజెన్సీలో గర్భిణీల కష్టాలు

కాకినాడ, ఏప్రిల్ 22 ఏజెన్సీలో గర్భిణీల కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఆస్పత్రికి వెళ్లేందుకు కనీస సదుపాయాలు లేక, డోలీలనే నమ్ముకోవాల్సి వస్తుంది. తాజాగా అల్లూరి జిల్లాలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది.అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం బొడ్లమామిడిలో నిండు గర్భిణీకి డోలి కష్టాలు ఎదురయ్యాయి. రోడ్డు సదుపాయం సరిగా లేక అంబులెన్స్ రాలేక సన్యాసమ్మ అనే గర్భిణీ నరకయాతన అనుభవించింది. దాదాపు రెండు కిలోమీటర్లు డోలి మోత మోయాల్సి వచ్చింది. పక్కా రోడ్డు నిర్మించాలని విన్నవిస్తున్నారు స్థానిక గిరిజనులు.డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్ పంచాయతీకి చెందిన బొడ్ల మామిడి గ్రామస్తురాలు సన్యాసమ్మకు డెలివరీ సమయం కావడంతో పురిటి నొప్పులు మొదలయ్యాయి. వెంటనే 108కు గ్రామస్తులు ఫోన్ చేశారు. అయితే గ్రామం వరకు రోడ్డు సరిగా లేక.. అంబులెన్స్ రాలేదని డ్రైవర్ చెప్పాడు. దీంతో ఇక చేసేది లేక సన్యాసమ్మకు డోలి కట్టారు. రెండు కిలోమీటర్లు డోలిమోత మోసుకెళ్ళి గ్రామస్తులు అంబులెన్స్ ఎక్కించారు.రోడ్డు పనులు ప్రారంభించి చాలాకాలం అవుతున్నా పూర్తి కాకపోవడంతో ఈ సమస్య తలెత్తిందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేసి మున్ముందు తమకు ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సంచలనంగా మారిన వీడియో

విజయవాడ, ఏప్రిల్ 22 ఏపీలో రాజకీయాల్లో ఓ వీడియో సంచలనంగా మారింది. రాజకీయాల్లో ఒక్కసారిగా హీట్ పెంచింది. టీడీపీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీడియోను వైసీపీ రిలీజ్ చేసింది. వైసీపీ 147 స్థానాల్లో ముందంజలో ఉన్నట్లు అధికార పార్టీ రిలీజ్ చేసిన టీడీపీ వీడియోలో ఉంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. టీడీపీ అంతర్గత సమావేశానికి సంబంధించిన వీడియోను వైసీపీ విడుదల చేసింది.అందులో వైసీపీ గెలుపు అంచనాలపై డిస్కషన్ జరిగినట్లుగా ఉంది. టీడీపీ స్టేట్ ఎలక్షన్ సెల్ కోఆర్డినేటర్ గా ఉన్న కోనేరు సురేశ్ టీడీపీ నేతలకు చెబుతున్న వివరాలు ఆ వీడియోలో ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో ఓట్ల షేరింగ్ ఏ విధంగా జరిగింది, రానున్న రోజుల్లో ఓట్ల షేరింగ్ ఏ విధంగా జరగబోతోంది? అన్నది పూర్తిగా వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారుఇందులో భాగంగానే 147 స్థానాల్లో వైఎస్ఆర్ సీపీ ముందుంది అని టీడీపీ నేతలే ఒప్పుకున్నారు, అందుకు సంబంధించిన వీడియోను మేము బయటపెడుతున్నాం అంటూ వైసీపీ విడుదల చేసింది. వైసీపీ 147 స్థానాల్లో ముందుంది అని స్వయంగా టీడీపీనే ఒప్పుకుంది, అందుకు సాక్ష్యం ఇదిగో అంటూ వీడియోను వదిలింది వైసీపీ. టీడీపీ సంచలన వీడియో లీక్.. ఓటమిని ముందే ఒప్పుకున్న టీడీపీ.. రాష్ట్రంలో 147 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ముందంజలో ఉందని టీడీపీ ఒప్పుకుంది. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా టీడీపీ నేతలకు ఆ పార్టీ స్టేట్ ఎలక్షన్ సెల్ కోఆర్డినేటర్ కోనేరు సురేశ్ దిశానిర్దేశం చేశారు" అంటూ వీడియోను జతపరిచి ట్వీట్ చేసింది వైసీపీ. 2014, 2019 ఎన్నికలతో పాటు రానున్న ఎన్నికల్లో ఏ విధంగా ముందుకెళ్లాలి అన్న దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ జరుగుతోంది. అయితే, ఇందులో 147 స్థానాల్లో వైసీపీ ముందంజలో ఉంది అని టీడీపీ ఒప్పుకుంది అంటూ వైసీపీ విడుదల చేసిన ఈ వీడియోతో ఒక్కసారిగా ఏపీ రాజకీయాల్లో హీట్ పెరిగింది. ఏపీ రాజకీయవర్గాల్లో ఈ వీడియో సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న పరిస్థితి

## తాడిపత్రిలో తొడగొట్టేది ఎవరు..

అనంతపురం, ఏప్రిల్ 22 (న్యూస్ పల్స్)గత ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గంలో సంచలనం నమోదయింది. దశాబ్దాలుగా ఏలిన జేసీ కుటుంబానికి కంచుకోటను కేతిరెడ్డి పెద్దారెడ్డి బద్దలు కొట్టగలిగారు. అప్పట్లో జగన్ వేవ్ తో అందరూ ఓటమిపాలయినట్లుగానే తాము ఓడిపోయామని జేసీ బ్రదర్స్ సర్ది చెప్పుకున్నారు. ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి గెలిచి ఇక్కడ పట్టు తమకు సడలలేదని నిరూపించారు. అందుకే ఈసారి తాడిపత్రి నియోజకవర్గంలో ఎన్నిక మాత్రం మామూలుగా లేదు. మొన్నటి వరకూ పెద్దారెడ్డి అసలు సరిపోడని భావించిన ప్రజలు గెలిపించారు. రెండోసారి ఆయనకు ఛాన్స్ ఇస్తారా? లేక జేసీ అస్మిత్ రెడ్డిని ఆశీర్వదిస్తారా? అన్నది మాత్రం పెద్ద ప్రశ్నగానే ఉందిఎమ్మిగనూరు ఏమవుతుందో? పెద్దారెడ్డి నమ్మకం... రాయలసీమలో వైసీపీ బలంగా ఉంది. అందులో ఏమాత్రం సందేహం లేదు. అదే సమయంలో జేసీ కుటుంబానికి కూడా పట్టున్న తాడిపత్రిలో మాత్రం గెలుపోటములను అంచనా వేయలేని పరిస్థితి. 2019 ఎన్నికలకు ముందు వరకూ అది జేసీ బ్రదర్స్ అడ్డా. కానీ ఆ పేరును పెద్దారెడ్డి చెరిపేశారు. జేసీ సోదరులకు ఇక్కడ ఏమీ లేదని నిరూపించారు. ఐదేళ్లలో తనను తాను నాయకుడిగా నిరూపించుకునే ప్రయత్నం చేశాడు పెద్దారెడ్డి. నియోజకవర్గాన్ని వదలకుండా.. అక్కడే అంటిపెట్టుకుని ఉన్న పెద్దారెడ్డి తనను మరొకసారి ఆశీర్వదించాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాలంటే తనను గెలిపించాలని ఆయన ఇంటింటికీ తిరుగుతున్నారు మరోవైపు గత ఎన్నికల్లో ఓటమి బాధతో కసితో ఉన్న జేసీ ఫ్యామిలీ ఈసారి కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడైన అస్మిత్ రెడ్డిని బరిలోకి దించింది. గత ఎన్నికల్లో ఓటమి పాలయిన సానుభూతితో పాటు జేసీ బ్రదర్స్ కుటుంబానికి ఉన్న పట్టు కూడా తన గెలుపునకు ఉపయోగపడుతుందని అస్మిత్ రెడ్డి భావిస్తున్నారు. పెద్దారెడ్డితో పోలిస్తే తాను యువకుడిని కావడంతో తాను గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పుకుంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నారు. జేసీ కుటుంబానికి ఈ ఎన్నికల్లో ఒకే సీటు రావడం... అదీ తాడిపత్రి కావడంతో అందరూ తాడిపత్రిపైనే ఫోకస్ పెట్టారు. తలా ఒక దిక్కుకు వెళ్లి ప్రచారాన్ని చేస్తున్నారుఇక ఆర్థికంగా కూడా ఇటు వైసీపీ, అటు టీడీపీ నేతలు బలమైన వారు కావడంతో డబ్బులు తాడిపత్రి నియోజకవర్గంలో బాగానే ఖర్చవుతున్నాయంటున్నారు. జేసీకుటుంబం ఈసారి అస్మిత్ రెడ్డి గెలుపును ప్రెస్టీజియస్ గా తీసుకోగా, పెద్దారెడ్డి తనను ఖచ్చితంగా ప్రజలు దగ్గరకు తీసుకుంటారన్న గట్టి నమ్మకంతో ఉన్నారు. ఇద్దరూ ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారే. బలం, బలగం కూడా ఇద్దరికీ సమానంగానే ఉంది. కానీ ప్రజల నాడి మాత్రం ఎవరికీ అర్థం కావడం లేదు. జేసీ కుటుంబం ఈసారి గెలిచి కోల్పోయిన ప్రతిష్టను తిరిగి నిలబెట్టుకోవాలని చూస్తుండగా, కేతిరెడ్డి పెద్దారెడ్డి సయితం గెలిచి తొడకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. మరి జనం ఎవరికి జేజేలు కొడతారన్నది చూడాల్సి ఉంది.

## నామినేషన్ దాఖలు చేసిన సింహాద్రి చంద్రశేఖర్

మచిలీపట్నం,మచిలీపట్నం వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్ర శేఖర్ మచిలీపట్నం కలెక్టరేట్ లో నామినేషన్ దాఖలు చేశారు. అవనిగడ్డ నుండి మచిలీపట్నం వరకు బారి రాలీ నిర్వహించగా, రాలిలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సింహాద్రి చంద్ర శేఖర్ తో పాటు అవనిగడ్డ ఎంఎల్ఎ సింహాద్రి రమేష్ బాబు. మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు, యువ నాయకులు సింహాద్రి వికాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.డాక్టర్ సింహాద్రి చంద్ర శేఖర్ మాట్లాడుతూ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశాను. అబద్ధాలు చెప్పం, చేయలేని పనులు చెప్పను. చేయగలిగిన పనులే చెబుతా, ఈ ప్రభుత్వం లో ప్రతి పేదవాడు ఆనందముగా ఉన్నాడు. విద్య, వైద్యం, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఈ ప్రభుత్వము ఇచ్చిందని అన్నారు..

## అవినీతి నిరూపిస్తే పోటీనుంచి తప్పుకుంటా

కోనసీమ,తన హయాంలో జరిగిన అవినీతిని నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని అమలాపురం వైసిపి అభ్యర్థి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఇటీవల చంద్రబాబు టిడిపి అభ్యర్థి ఆనందరావు చేసిన అవినీతి ఆరోపణలు పై విచారణ సిద్ధమని ఆయన అన్నారు. అమలాపురం వైసిపి అభ్యర్థిగా ఈరోజు విశ్వరూప్ నామినేషన్ దాఖలు చేశారు. ప్రస్తుత టిడిపి అభ్యర్థి ఆనందరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోను తాను ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చ కి సిద్ధమంటున్నారు.

# అందరి చూపు పుంగనూరు వైపు...

**ముగ్గురు రామచంద్రుల్లో గెలిచేదెవరు?**

**నాలుగో సారి మంత్రి పెద్దిరెడ్డి సత్తా చాటుకుంటారా ?**

**ఉత్కంఠ గా మారిన పుంగనూరు రాజకీయ సమీకరణాలు.**

పుంగనూరు ,పుంగనూరు నియోజకవర్గం అంటే రాష్ట్రంలోనే ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎందుకంటే రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన పాత్రను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని చెప్పుకోవచ్చు. అసెంబ్లీ ఎన్నికల బరిలో వైకాపా తరపున రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తెలుగుదేశం పార్టీ తరపున చల్లా రామచంద్రారెడ్డి, బీసీవై పార్టీ తరపున ఆ పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ లు నేటి వరకు బరిలో ఉన్నారు.చివరకు వీరి పేర్లే ఖరారు అయితే అందరి పేర్లలోనూ రామచంద్ర ఉండడంతో ఈసారి ఏ రామచంద్రుడు విజయ శంఖం పూరిస్తాడో అని ప్రజలలో చర్చలు మొదలయ్యాయి. పుంగనూరు నియోజకవర్గం అంటే ఒకప్పుడు తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉండేది.మాజీ ఎంపీ దివంగత నేత నూతన కాల్వ రామకృష్ణారెడ్డి ఓటమి ఎరుగని నాయకుడిగా, పుంగనూరు నుంచి పలుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపీగా తెలుగుదేశం జెండా ఎగురవేశారు.సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలు పుంగనూరులో కలవడంతో ప్రస్తుత రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీలేరు నియోజకవర్గం వదిలి పుంగనూరు నుంచి బరిలో దిగారు. 2009 వ సంవత్సరం నుండి తెలుగుదేశంకు కంచుకోటలా ఉన్న పుంగనూరులో తన ఎదురులేని నాయకత్వ పటిమతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడుసార్లు హ్యాట్రిక్ విజయం సాధించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున 84083 ఓట్లు, 2014 వైకాపా తరుపున 1,04587 ఓట్లు, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 1,07431 ఓట్లు సాధించి ప్రతిపక్ష అభ్యర్థులపై భారీ మెజారిటీతో పుంగనూరును వైయస్సార్ పార్టీ కంచుకోటగా మార్చేశారు.ఇక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీ (2009) నుంచి గత మూడు పర్యాయాలు ఓటమి చెందింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 43356 ఓట్లు, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 72856 ఓట్లు, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 63876 ఓట్లు సాధించింది. పుంగనూరులో అభ్యర్థి ఎవరైనా తెలుగుదేశం పార్టీకి 60 వేలకు పైగా ఓటు బ్యాంకు గ్యారెంటీ అని నిరూపించడానికి ఇది సంకేతం. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా చల్లా రామచంద్రారెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు, గతంలో (1989) పీలేరు అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పై పోటీ చేసిన అనుభవం, తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వారసత్వం అనుచరగణం రాజకీయ పరంగా చల్లా బాబుకు కలిసొచ్చే అంశం. ప్రస్తుతం చల్లా రామచంద్రారెడ్డి ఎన్నికల మహాసంగ్రామానికి ఎంతవరకు ముందుకు తీసుకెళ్తారనేది ఇన్చార్జి చల్లా బాబు నాయకత్వానికి పెద్ద సవాల్ గా మారనుంది. జనసేన మద్దతు జన సైనికుల సహకారం చల్లాబాబుకు ప్లస్ పాయింట్ కానుందా అనేది వేచిచూడాలి.ఇక భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యువ నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ పుంగనూరు నియోజకవర్గంలో తనదైన ముద్ర వేయాలని పావులు కదుపుతున్నారు. ఈయన గత 2019 అసెంబ్లీ ఎన్నికలో జనసేన తరపున బరిలో దిగి 16,452 ఓట్లు సాధించారు. రాజకీయ అనుభవం లేకున్నా అంతుచిక్కని వ్యూహాలతో ప్రత్యర్థి నాయకులకు రాజకీయ సవాళ్లు విసురుతుంటారు. అధికార పక్షం నాయకులతో ప్రత్యక్ష యుద్ధమే చేస్తున్నారు. ఈసారి పుంగనూరు నుంచి బీసీవై పార్టీ అభ్యర్థిగా ఆయన బరిలో దిగనున్నారు. బోడే రామచంద్ర యాదవ్ కు ఢిల్లీ స్థాయిలో, జాతీయ నేతలతో, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మంచి సంబంధాలు ఉండడం, యాదవ సామాజిక వర్గం, వై ప్లస్ కేటగిరి భద్రత కలిగి ఉండడం బోడె రామచంద్ర యాదవ్ కు కలిసొచ్చే అంశాలు. పుంగనూరు నియోజకవర్గంలో రామచంద్ర యాదవ్ ను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేరుగా ఢీకొట్టలేకపోతున్నారని, రామచంద్ర యాదవ్ తలపెట్టే అన్ని కార్యక్రమాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన అధికార బలంతో, పోలీసును అడ్డుపెట్టుకుని తాను తలపట్టే కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇది నేటి వరకు పుంగనూరులో ముగ్గురు రామచంద్రుల రాజకీయ చిత్రం. ......

# శ్రీశైలం మల్లన్న సేవలో నారా చంద్రబాబు దంపతులు

శ్రీశైలం,నంద్యాల జిల్లా శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారిని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి దర్శించుకున్నారు. శ్రీశైలం దర్శన పర్యటనలో భాగంగా ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా హైదరాబాదు నుంచి సుండిపెంట హెలిప్యాడ్ కు చేరుకున్నారు. దర్శనార్థం సుండిపెంటకు చేరుకున్న నారా చంద్రబాబు దంపతులకు నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం మాజీ టిడిపి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి టీడీపీ ఉమ్మడి జిల్లాల పలువురు నాయకులు,కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు సుండిపెంట హైలిప్యాడ్ నుండి ప్రత్యేక కాన్వాయ్ ద్వారా రోడ్డు మార్గంలో చంద్రబాబు దంపతులు మొదటగా శ్రీసాక్షిగణపతిస్వామిని దర్శించుకొని అనంతరం శ్రీశైలం చేరుకున్నారు..దర్శనార్థం శ్రీశైలం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు,భువనేశ్వరి దంపతులకు ఆలయ మర్యాదలను అనుసరించి ఆలయ అర్చకస్వాములు స్వాగతం పలికారు అనంతరం ద్వాదస్తంభానికి నమస్కరించి శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారిని దర్శించుకుని మల్లికార్జునస్వామికి రుద్రాభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు భువనేశ్వరి దంపతులకు అర్చకులు,వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ స్వామి అమ్మవార్ల ప్రసాదాలు శేషవస్త్రాలు శ్రీస్వామి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు..

# నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం

వరల్డ్ బుక్ డే లేదా వరల్డ్ బుక్ మరియు కాపీరైట్ డే, పఠనం, ప్రచురణ మరియు కాపీరైట్ ప్రోత్సహించడానికి యునెస్కో ద్వారా ప్రతి సంవత్సరం 23 ఏప్రిల్ న ప్రపంచ పుస్తకదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. యునైటెడ్ కింగ్డమ్ లో, బుక్స్కి ఒక రోజు కావాలని మార్చి మొదటి గురువారం గుర్తించారు . వరల్డ్ బుక్ డే ఏప్రిల్ 1995, 23 న మొదటి సారి జరుపుకున్నారు. ఇలా ఈరోజు నే జరుపుకోవాలని ఎందుకు అనుకున్నారంటే దానికి




చాలా కారణాలు వున్నాయి. సెవాంతెస్, షేక్స్పియర్, ఇన్కా గర్సి లాసో, వేగా అను రచయితలు 1616 ఇదే రోజున మరణించారు. అంతేకాదు జోసెఫ్ ప్లా, వ్లాదిమర్, మారిస్ ద్రువాం ఇలా ఇంకా చాలా మంది ప్రపంచ ప్రఖ్యాత రచయితలు ఇదే రోజున మరణించడమో, జన్మించడమో జరగడం విశేషం. ఇదే రోజున సెయింట్ జార్జ్ జన్మది నాన్ని స్పెయిన్లో జరుపుకుంటారు. ఇప్పటికీ స్పెయిన్లో ప్రతి పుస్తక కొనుగోలు పై ఒక గులాబీని గిఫ్ట్గా ఇస్తారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ రోజును1995 లో యునెస్కో 'ప్రపంచ పుస్తక దినం' గా ప్రకటించిండమేకాదు, ప్రపంచ పుస్తక మరియు కాపీ హక్కుల దినంగా జరపాలని, రచయితలను, ప్రచురణకర్తలను, పాఠకులను, ఉపాధ్యాయులను ఈ రోజున గౌరవించాలని సూచించింది. అంతర్జాలం, మీడియా కొంత వరకూ పుస్తకం మనుగడను అడ్డుకుంటున్నాయి అనటంలో ఎటువంటి సందేహము లేదు కదా . పుట్టినరోజులకు బహుమతులుగా మంచి పుస్తకాలను ఇస్తే చాలా బాగుంటుంది. అప్పుడు పిల్లలందరు చదవటానికి బాగుంటుంది. పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పొందటమే కాకుండా, మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుంది, మనిషిని మనిషిలా వుంచుతుంది, కోపం వచ్చినప్పుడు పుస్తకం చదివితే మనకు తెలియకుండానే కోపం పోతుంది ఇది నిజం. పుస్తకం మంచి స్నేహితుడివంటిది. ఇంకా చాలా ఉపయోగాలు వున్నాయి. అందుకే పుస్తక పఠనం చేయండి. ఇంకెందుకు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఈరోజు నుండే పుస్తక పఠనం మొదలుపెట్టండి. ప్రపంచ పుస్తకదినోత్సవ శుభాకాంక్షలు.

# ఇందిరమ్మ రాజ్యంతోనే పేద ప్రజలు అభివృద్ధి

**బద్వేలు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ జ్యోతి**

బద్వేలు, ఎస్సీ బిసి ఎస్టి మైనార్టీలు అభివృద్ధి కావాలంటే ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి హస్తం గుర్తుకు ఓటు వేయాలని బద్వేలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ జ్యోతి నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయ జ్యోతి బద్వేలు ఆర్ ఓ ఆకుల వెంకట రమణకు నామినేషన్ సమర్పించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ మీడియా కార్యదర్శి డాక్టర్ తులసి రెడ్డి సిపిఎం సిపిఐ నాయకులు ఉన్నారు. నామినేషన్ సమర్పించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ 125 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేద ప్రజలు అభివృద్ధి పథంలో నడవాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఆమె పిలుపునిచ్చారు. బద్వేలు నియోజకవర్గం లో ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించాలని ఈసారి జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి నన్ను గెలిపించి ప్రజా సేవ చేయడానికి అవకాశం కల్పించాలని విజయ జ్యోతి ప్రజలను కోరారు .అలాగే కడప పార్లమెంట్ అభ్యర్థి షర్మిల రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆమె తెలిపారు.భారీ ర్యాలీవిజయ జ్యోతి నామినేషన్ సందర్భంగా సోమవారం బద్వేల్ పట్టణంలో కాంగ్రెస్ సిపిఎం సిపిఐ పార్టీలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని సిపిఐ పార్టీ కార్యాలయం నుండి పోరుమామిళ్ల రోడ్డులోని ఆర్డిఓ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది.

# వికర్స్ కాలనీ వైసిపి నాయకులు జనసేన తీర్థం


తాడేపల్లిగూడెం,తాడేపల్లిగూడెం వికర్స్ కాలనీకి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు సోమవారం జనసేన పార్టీలో చేరారు. బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద మేడపాటి చెల్లారెడ్డి ఆధ్వర్యంలో గంధం సత్తిబాబు, కాసిన శ్రీనివాస్, సోపేటి జానీ, శివ, కృష్ణ లతోపాటు 50 మంది వైఎస్ఆర్సిపి నుంచి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైఎస్ఆర్సిపి మొత్తం ఖాళీ అవుతుందని ఆ పార్టీపై ఇటు నాయకులలోను, ప్రజల్లోనూ విశ్వాసం లేదన్నారు. మూడు వంతులు వైసీపీ నాయకులు జనసేనలోకి వచ్చారని మరికొందరు వచ్చేందుకు ఎదురుచూస్తున్నారు అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలే సాగనంపేందుకు చూస్తున్నారన్నారు. పవన్ బహిరంగ సభకు యువత పెద్ద ఎత్తున తరలి వస్తుందని వారందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

## హిందువుల పార్టీ అని చెప్పుకునే బీజేపీ.. అగర్‌బత్తీలపై సైతం జీఎస్టీ వేసింది



హైదరాబాద్ : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కఅన్నారు. కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. అలాగే హిందూ పార్టీ అని చెప్పుకునే బీజేపీ అగరబత్తీల పై కూడా జీఎస్టీ విధించిందని విమర్శించారు.ఇది ఆ పార్టీకి హిందులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జీఎస్టీ తెచ్చి రూ. 54లక్షల కోట్లను పేదల నుంచి వసూలు చేశారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. మోదీ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. అలాంటి పార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

## మతం ఆధారంగా ఏ నాగరిక దేశం పౌరసత్వాన్ని ఇవ్వదు: సీఎం విజయన్



కన్నూరు: ఏ నాగరిక దేశమైనా మతం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వదని కేరళ సీఎం విజయన్అన్నారు. దేశంలోని సెక్యులర్ భావాలకు పౌరసత్వ సవరణ బిల్లు వ్యతిరేకమని ఆయన తెలిపారు. సెక్యులరిజం రక్షణ కోరుతూ సీఏఏకు వ్యతిరేకంగా తాము పోరాడుతుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం బీజేపీకి వ్యతిరేకంగా ఎటువంటి నిరసన తెలుపులేదన్నారు. రాష్ట్రంలో లోకసభ ఎన్నికల ప్రచార నిమిత్తం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మట్టన్నూరులో ఆయన ప్రసంగిస్తూ.. ఏ నాగరితక దేశమైన మతం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వలేదన్నారు. మతాన్ని ఆధారం చేసుకుని కాందిశీకలను విడదీయదన్నారు. పౌరసత్వాన్ని ఇచ్చి దాని ఆధారంగా మతాన్ని క్రియేట్చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశంలో ఆర్ఎస్ఎస్ ఎజెం

## కర్నాటకను ఏటీఎంలా వాడుకుంటున్న కాంగ్రెస్ : బీజేపీ



కాంగ్రెస్ పార్టీ కర్నాటకను ఏటీఎంలా వాడుకుంటోందని తమిళనాడు బీజేపీ నేత కే అన్నామలై ఆరోపించారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు సైతం కాంగ్రెస్ కర్నాటకను నిధుల కోసం ఏటీఎంలా వాడుకుంటుందని కాషాయ పార్టీ ప్రజలను హెచ్చరించిందని గుర్తుచేశారు. రాష్ట్ర ఖజానాను కాంగ్రెస్ ఖాళీ చేస్తోందని దుయ్యబట్టారు.మాజీ సీఎం బొమ్మై పదవి నుంచి దిగిపోయినప్పుడు కర్నాటక ఆదాయంలో మిగులు రాష్ట్రంగా ఉందని గుర్తుచేశారు. అలాంటి కర్నాటక ఇప్పుడు ఆదాయ లోటుతో సతమతమవుతోందని అన్నామలై ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్ర ప్రజలు స్పష్టమైన వైఖరితో ఉన్నారని, గతంలో చేసిన పొరపాటు పునరావృతం కారాదని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు.కర్నాటకలో మొత్తం 28 స్థానాలను బీజేపీ-ఎన్డీయే కూటమి గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా ఉంటుందని, వారు అన్నిరకాల బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడతారని హుబ్బలిలో జరిగిన ఘటన ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. ఇక ఏప్రిల్ 26, మే 7న రెండు దశల్లో కర్నాటకలో లోక్సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

## గడ్డం వంశి కృష్ణ నుఅత్యధిక మెజార్టీతో గెలిపించా

కమాన్ పూర్,పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ నేత ల శీను బాబు అన్నారు. సోమవారం రామగిరి మండలం కలవచర్ల శ్రీరామాంజనేయ స్వామి దేవాలయంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తో కలిపి శీను బాబు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శీను బాబు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ప్రతి కార్యకర్త గెలుపు నకు కృషి చేయాలని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ధ్యయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్లతిరుపతి యాదవ్ ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యమై మెరిసిన బీరవోలు పల్లె రైతు బిడ్డ.నంద్యాల గురురాజ పాఠశాలలో 594 మార్కులు సాధించిన విద్యార్థి హర్షిత.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-పదవ తరగతి ఫలితాలలో మట్టిలో మాణిక్యమై మెరిసిన ఓ పల్లె రైతుబిడ్డ 594 మార్కులు సాధించి నంద్యాలలోని గురురాజ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచింది. వివరాల్లోకెళితే రుద్రవరం మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన పుల్లారెడ్డి, శిరీష దంపతుల కుమార్తె ఎం హర్షిత నంద్యాలలోని గురురాజ పాఠశాలలో 10వ తరగతి చదివి పరీక్షలు రాసి పాఠశాలలో అందరి విద్యార్థుల కన్నా మెరుగైన ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రశంసలు అందుకుంది. తమ కూతురు పదవ తరగతి పరీక్షల్లో ఇలా మొదటి ర్యాంకు సాధించినందుకు తమకెంతో ఆనందంగా ఉందని విద్యార్థిని, తల్లిదండ్రులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాము కష్టపడి చదివించినందుకు తల్లిదండ్రుల పేరు నిలబెట్టిందన్నారు. మన బీరవోలు గ్రామానికి చెందిన విద్యార్థి మొదటి స్థానంలో నిలిచడంతో గ్రామస్తులు ఆ విద్యార్థిని అభినందించి తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఇలాగే గ్రామంలోని విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మన గ్రామానికి మంచి పేరు తేవాలని గ్రామ ప్రజలందరూ కోరారు.



## మెరిసిన ఆణిముత్యాలు.రుద్రవరం మండల టాపర్ పి జేశ్విత్.









నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-రుద్రవరం ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తమ విద్యార్థులు మెరిసిన ఆణిముత్యాలు అని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గౌరవ మోడల్ స్కూల్ జె. డి వెంకట కృష్ణ రెడ్డి,నంద్యాల జిల్లా విద్యాధికారి సుధాకర్ రెడ్డి, ఆశీస్సులతో,మండల విద్యాధికారి కోటయ్య,లక్ష్మి ల సహకారంతో మా పిల్లలు అందరూ బాగా చదువుకోని 99 శాతం మంది పాస్ అయ్యారు అని అన్నారు. వివరాల్లోకి వెళ్ళితే రుద్రవరం ఆదర్శ పాఠశాల మరియు కళాశాల యందు ఈ రోజు విడుదల చేసిన 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో రుద్రవరం ఆదర్శ పాఠశాల మరియు కళాశాల విధ్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సారి జేశ్విత 576 మార్కులు సాధించి రుద్రవరం మండల టాపర్ గా నిలిచింది అని అన్నారు.99 శాతం మంది గ్రామీణ, పల్లెల్లో ఉండే పెద పిల్లలు, కష్ట పడి బాగా చదువుకోని తమ సత్తా చాటి ఆదర్శ పాఠశాల విజయ దుందుభి మోగించారు.మానస లక్ష్మి 565 మార్కులు,గంగా 554,వెంకట జయశ్రీ 541 మార్కులు,13 మంది కి 500 మార్కుల మైలు రాయి దాటి తన సత్తా చాటి చెప్పారు అని అన్నారు.72 మంది పిల్లలు పరీక్ష రాయగా,71 మంది పాస్ అయ్యారు అని అన్నారు.పిల్లలు అందరూ బాగా చదువుకోని 99 శాతం పాస్ అయ్యారు అని అన్నారు.వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్,ఉపాధ్యాయ బృందం సిబ్బంది విద్యార్థిని, విద్యార్థుల విద్యార్థులు అందరూ కలసి అభినందనలు తెలిపినారు.



## కస్తూర్బా పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత... ప్రిన్సిపల్ లక్ష్మీదేవి.



నంద్యాల/రంద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో తమ విద్యార్థులు 99% ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 41 మంది విద్యార్థులకు గాను 39 మంది విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారన్నారు. అలాగే ఐదు మంది విద్యార్థులు 500 మార్కులు పైన ఉత్తీర్ణత సాధించారన్నారు.

# గిద్దలూరు గ్రామంలో వైసిపిని వీడి టీడీపీ లో చేరిన 50 కుటుంబాలు సంజమల

శ్రీ ప్రస్తానం న్యూస్ నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండలంగిద్దలూరు గ్రామంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా గిద్దలూరు టీడీపీ నాయకుడు బత్తుల ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ పార్టీకి చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు నీలి నాగయ్య, పసుపులేటి వెంకట కృష్ణయ్య, గానిగే మహబూబ్ బాషా, ఉప్పలూరి నరసింహులు, బెల్లం కనకరాజు, పసుపులేటి కృష్ణమూర్తి, సుద్దపల్లి భాష, నీలి సురేష్, బెల్లంకొండ చంద్ర,బెల్లంకొండ శంకరయ్య, ఈడిగ రమణ గౌడ్, పాలూరి మహబూబ్ బాషా, భూషన్నగారి వెంకటేశ్వర్లు, నీలి రమణ, గానిగే షరీఫ్, గానిగే పెద్ద షరీఫ్, పాటూరి ఆటో మాబు, తెలుగు కిట్టు, తెలుగు సుబ్బయ్య, ఈడిగా నరసింహుడు, నడిపి మునయ్య, పసుపులేటి పెద్ద నారాయణ, పసుపులేటి డ్రైవర్ నారాయణ, పసుపులేటి రమణ, పసుపులేటి ప్రసాద్, పసుపులేటి హరి, నీలి సుధాకర్, నీలి సురేంద్ర, నీలి శివశంకర్, నీలి సురేష్, నీలి ప్రసాద్, నీలి నాగరాజు, నారాయణ, సురేంద్ర, రమేష్, ఈడిగ చంద్ర, లేనిష్, పాలూరి షరీఫ్, పాటూరి మహమ్మద్ రఫీ, పసుపులేటి వెంకట కృష్ణయ్య, పసుపులేటి శ్రీనివాసులు, తెలుగు గోపాల్ తదితర 50 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు వైసీపీ ని వీడి టీడీపీలో చేరారు. వారికి బీసీ ఇందిరా రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గం అభివృద్ధి చెందాలి అంటే అది ఒక్క బీసీ జనార్దన్ రెడ్డి తోనే సాధ్యమని అందుకనే వైసీపీ ని వీడి బీసీ ఇందిరా రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరటం జరిగింది అని తెలిపారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని, బనగానపల్లె శాసన సభ్యులుగా బీసీ జనార్ధన్ రెడ్డిని గెలిపించుకోవడమే తమ ధ్యేయంమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ అభిమానులు పాల్గొన్నారు.



## 10 వ తరగతి ఫలితలాలలో మెరిసిన ప్రభుత్వ పాఠశాలలు.

శ్రీ ప్రస్థానం న్యూస్ / కోవెలకుంట్ల, ఏప్రిల్ 22 :- సోమవారం నాడు పరీక్ష ఫలితాలు విడుదల కాగా ఫలితలలో కోవెలకుంట్ల మండలంలో ని స్థానిక డా. అంబేద్కర్ గురుకులం పాఠశాలకు చెందిన శ్రీరాముల మహిమరాణి 600 వందలకు 582 మార్కిలు సాధించి మండల టాపర్ గా నిలిచింది, జిల్లా పరిషత్ హైస్కూల్ గర్ల్స్ పాఠశాల లో దోడియం సన్నల గోనామృత 600 మార్కులకు 581 మార్కుల తో మెరిసింది. దీనితో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు యం.ఈ.ఒ వెంకట సుబ్బయ్య వారిని అభినందించారు. అదేవిధముగా అదే స్కూల్ కు చెందిన శామీరా 600 మార్కులకు 575 మార్కులు సాధించి ప్రైవేట్ స్కూల్స్ ధీటుగా ఫలితాలు సాధించారు. ఎంపీపీ ఎస్ గాంధీనగర్ పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు చదివిన ఎస్ సమీరా అను మా పాఠశాల విద్యార్థిని తర్వాత జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ కోయిలకుంటలో చేరి ఆరు నుండి 10వ తరగతి వరకు ఆ పాఠశాలలో చదివి ఈరోజు వచ్చిన ఎస్ఎస్సి పరీక్ష ఫలితాల్లో 600కు 575 మార్కులను సాధించినందుకు గాంధీనగర్ ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బి. మధుమతి, ఉపాధ్యాయులు పి. మనోహర్, ఎస్. శిరోమణి మరియు విద్య వాలంటీర్స్ ఎస్. రేష్మ, పద్మావతి, పాఠశాల చైర్మన్ సుబ్బమ్మ, వైస్ చైర్మన్ నాగేశ్వరరావు ఎస్ సమీరా కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఫలితాలు ప్రైవేట్ స్కూల్స్ కంటే ప్రభుత్వ పాఠశాలు మంచి ఫలితాలు







సాధించాయని అందుకే రాబోయే విద్య సంవత్సరం లో మీపిల్లలను ప్రభుత్వ పాఠశాలో చేర్పించవలయినని ఆమె కోరారు.

# డబ్ల్యూ.గోవిందిన్నే గ్రామంలో విస్తృతం గా ఎన్నికల ప్రచారం .. గంగుల అవంతిక రెడ్డి

దొర్నిపాడు,ఏప్రిల్:22, శ్రీ ప్రస్థానం న్యూస్:- మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నే గ్రామంలో సోమవారం నాడు ఆళ్లగడ్డ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, గంగుల విజేంద్రా రెడ్డి సోదరీ గంగుల అవంతిక రెడ్డి, ఎంపిపి .గోపవరం అమర్నాథ్ రెడ్డి,గ్రామ వైసిపి నాయకుల తో పాటు లతో పాటు కలసి వైసిపి కి ఓటు వేయాలంటూ ఇంటింటికి తిరుగుతూ ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూనే గ్రామస్థుల యెక్క పలు సమస్యలనూ అడిగి తెలుసుకున్నారు... తొలుత ఆమెకు గ్రామస్తులు పూల వర్షం కురిపిస్తూ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతలు పడుతూ ఘనంగా స్వాగతం పలుకుతూ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా పోచా బ్రహ్మానందరెడ్డి,లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.. మన రాష్టానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రి, అయితేనే సంక్షేమం, తో పాటు రాష్ట్రం అభివృద్ది చెందుతుందని... అందుకు ప్రజలందరూ కూడా ఆశీర్వదించాలని కోరారు... ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతల రెడ్డి,యాదవ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్,సింగిల్ విండో చైర్మన్ భూమా చెంచి రెడ్డి, వైఎస్సార్ మండల ప్రసిడెంట్ కాకర్ల మోహన్ నాయుడు, మండల సచివాలయం కన్వీనర్ శివా రెడ్డీ, సర్పంచ్ లు పి. మాధవి లత, బి.శివ రామి రెడ్డి, ఎం. మహేష్,గ్రామ వైసిపి నాయకులు జాకీర్ బాషా, శివ ప్రసాద్,కర్నాటి కృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి,శాంతయ్య, బోయ చిన్న మద్దిలేటి, డీలర్ పెద్దన్న, శివ ప్రసాద్, చిన్న కరిముల్ల, రఫి,నంశద్ బాషా,బత్తుల కృష్ణయ్య, విజయ సింహ చౌదరి, విష్ణు వర్ధన్ రెడ్డి,బి. లక్ష్మి కాంతం రెడ్డి,రాముడు,కిషోర్, అభిమానులు, వైసిపి కార్యకర్తలు, గంగుల అభిమానులు ప్రజలు పాల్గొన్నారు...



## 10 ఫలితాల్లో అగ్రగామిగా నిలిచిన లిటిల్ స్టార్ హై స్కూల్....!

*మండల ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన లిటిల్ స్టార్ స్కూల్....!*







ఏప్రిల్ 22 కుక్కునూరు (ప్రస్థానం న్యూస్) మండలంలో పదవ తరగతి ఫలితాల్లో మండల ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలను సాధించి లిటిల్ స్టార్ హై స్కూల్ మండలంలో అగ్రగామిగా నిలిచింది. వివరాలు ఇలా ఉన్నాయి లిటిల్ స్టార్ హై స్కూల్ కి చెందిన కే శృతి 572 మార్కులతో మండలంలో ప్రధమ స్థానం సాధించగా మండల ద్వితీయ స్థానం సైతం ఇదే స్కూల్ కు చెందిన డి మోహన్ సాయి 543 మార్కులతో మండల ద్వితీస్థానసీ సాధించాడు అదేవిధంగా మండల తృతీయ స్థానం సైతం ఇదే స్కూలుకు చెందిన ఎస్.కె ఆయుష 521 మార్కులు సాధించారు మండల ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించటంతో ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఆది సత్యనారాయణ మరియు ఉపాధ్యాయ బృందం ఆయా విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు అదేవిధంగా లిటిల్ స్టార్ స్కూలుకు చెందిన 30 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు మండలంలో లిటిల్ స్టార్ విద్య సంస్థ అగ్రగామిగా నిలిచింది ఇదే మండలంలో స్థానిక జడ్.పి. హెచ్.ఎస్ హైస్కూల్ నుండి 60 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 56 మంది ఉత్తీర్ణులయ్యారు చేరవల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల నుండి 46 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 28 మంది ఉత్తీర్ణులయ్యారు అమరవరం ఉన్నత పాఠశాల నుండి 30 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు మాధవరం ఆశ్రమ పాఠశాల నుండి 26 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 18 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు బాలికల ఉన్నత పాఠశాల నుండి 36 మంది విద్యార్థులు పరీక్ష రాయిగా 29 మంది ఉత్తీర్ణులయ్యారు కేజీబీవీ కుక్కునూరు పాఠశాల నుండి 37 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 33 మంది ఉత్తీర్ణులయ్యారు కేజీబీవీ వేలేరు నుండి 32 మంది పరీక్ష రాయగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు మండలంలో ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన లిటిల్ స్టార్ హై స్కూల్ విద్యార్థులకు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఆది సత్యనారాయణ మరియు అధ్యాపక బృందం వారి దగ్గరికి వెళ్లి అభినందనలు తెలియజేసి స్వీట్స్ పంచారు ప్రతి విద్యార్థి ఉత్తమమైన విద్యతో ముందుకు సాగాలని ఉన్నత చదువుల పైన అదే స్థాయిలో ఆసక్తి కనపరిచి మంచి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని ప్రధాన ఉపాధ్యాయులు ఆది సత్యనారాయణ తెలిపారు.

## నామినేషన్ కార్యక్రమం ప్రజలకు ఆహ్వానం

**పచ్చారపల్లి రాఘవేంద్ర రెడ్డి**

హాలహర్వి మండలం ప్రస్థానం న్యూస్ ఏప్రిల్ 23:- ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఆలూరు నియోజకవర్గ వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుసినే విరుపాక్షి నామినేషన్ కార్యక్రమం 23-04-2024 మంగళవారం సమయం 09:00 గంటలకు ఆలూరు నియోజకవర్గ కేంద్రంలో సాయిబాబా దేవాలయం నుండి తహశీల్దార్ ఆఫీస్ వరకు భారీ ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ వేయనున్నారు అని పచ్చారపల్లి రాఘవేంద్ర రెడ్డి అన్నారు.జననేత బుసినే విరుపాక్షి నామినేషన్ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గ ప్రజలు, వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు ఆరు మండలాల కన్వీనర్లు, కో కన్వీనర్లు, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, సొసైటీ చైర్మన్లు, కెడిసిసి డైరెక్టర్లు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు,జేసిఎస్ మండల ఇన్చార్జిలు, సచివాలయ కన్వీనర్లు, విద్యా కమిటీ చైర్మన్లు, బూత్ కమిటీ మెంబర్లు, నీటి సంఘం అధ్యక్షులు, రైతు సంఘం అధ్యక్షులు, గృహ సారధులు, పార్టీ అనుబంధ విభాగాలు, వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు,యువత మీడియా ప్రతినిధులు, బుసినే విరుపాక్షి ని ప్రేమించే ప్రతి గుండె, పెద్ద ఎత్తున తరలివచ్చి బుసినే విరుపాక్షి ని ఆశీర్వదించి ఆశీస్సులు ఇవ్వాలని, నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానిస్తున్నాము తెలిపారు.



## పది ఫలితాల్లో సత్తా చాటిన సప్తగిరి స్కూల్.



కోయిలకుంట్ల , శ్రీ ప్రస్తానం న్యూస్ / ఏప్రిల్ 2024 :- నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కోయిల కుంట్ల పట్టణం సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ప్రకటించిన పది ఫలితాల్లో కోయిల కుంట్ల సప్తగిరి స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల సప్తగిరి స్కూలు హెడ్ మాస్టర్ నాగేశ్వర రెడ్డి తెలిపారు.తమ పాఠశాల విద్యార్థులు బి.సాయి జ్యోతిక 586 , కె . సుదీప్తి 576, పి . వరుణ్ తేజ్ 568, పి.హుస్సేన్ వలి 568, వీరితో కలిపి మొత్తం 12 మంది విద్యార్థులకు 540 కు పైగా మార్కులు విద్యార్థులు సాధించారని పాఠశాలలో మొత్తం 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించడానికి కారణమైన పాఠశాల అధ్యాపక బృందాన్ని ,విద్యార్థినీ విద్యార్థులను హెడ్ మాస్టర్ సప్తగిరి నాగేశ్వర రెడ్డి అభినందించారు.

## కాటసాని రాంభూపాల్ రెడ్డి నామినేషన్ జనసంద్రం

శ్రీ ప్రస్థానం-గడివేముల :- ఏప్రిల్ 23 :-అభిమాన నాయకుడు నామినేషన్ వేసిన వేళ.. అశేష జనవాహిని ఉరకలెత్తే ఉత్సాహంతో వెంట సాగింది. మండే ఎండలో 'సంక్షేమ' నినాదాలు వినిపించింది.పోటీలో ఎవరు ఉన్నా గెలుపు మనదే అన్న ఆత్మవిశ్వాసం కనబరిచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాణ్యం నిజ వర్గ అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి నామినేషన్ పర్వం సోమవారం అట్టహాసంగా సాగింది. పార్టీ శ్రేణులు విజయ భరోసా కల్పిస్తూ అభ్యర్థి తో అడుగు కలిపాయి. అండగా నిలిచాయి. వైఎస్సార్సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి నామినేషన్ మన బాధ్యత అంటూ ఊరూవాడా కదలివచ్చింది. చిన్నమ్మ సర్కిల్ లోని తన ఇంటి నుంచి వేలాదిగా వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. దారిపొడవునా జగన్ నినాదాలు మిన్నంటాయి. సంక్షేమ పాలనకు అండగా ఉంటామంటూ మహిళలు హారతలిచ్చి ఆశీర్వదించారు. జగనన్న మాట ప్రకారం మా అందరికీ సంక్షేమ ఫలాలు అందజేశారని... మేము కూడా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తామని మాట ఇచ్చారు. అభిమాన నాయకుడికి మద్దతుగా కదలివచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం లో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. నాలుగు మండలాల వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పదవ తరగతి సత్తా సాధించిన విద్యార్థిని, హుసేనమ్మ



హాలహర్వి ప్రస్థానం న్యూస్ ఏప్రిల్ 23 :- హాలహర్వి మండల కేంద్రంలో 2023-24 సంవత్సరం లో పదవ తరగతి లో 600 మార్కులకు గాను 558 మార్కులు సాధించిన హాలహర్వి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థిని దలవాయి హుస్సేనమ్మ , సత్తా ఘనవిజయం సాధించడం గర్వకారణమని ఆ పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులుహర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుతే ఆ గ్రామానికి మండలానికి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందని, జిల్లాలో రాష్ట్రంలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని. ఉపాధ్యాయులు కోరారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757